ప్రజాశక్తి
శుక్రవారం 13 డిసెంబర్ 2024 5 అనంతపురం



కళ్యాణదుర్గంలో నేడు, రేపు జాబ్‌మేళా

8వేల మంది పేర్లు నమోదు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

కళ్యాణదుర్గం పట్టణంలోని దొడగట్ట వద్ద ఉన్న జ్ఞానభారతి స్కూల్‌లో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు తెలిపారు. ఆయన గురువారం బ్రహ్మసముద్రంలో జాబ్‌మేళాపై యువతీ, యువకులకు అవగాహన కల్పించారు. జాబ్‌మేళాలో ఇప్పటికే 8 వేల మందికి పైగా పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. ఎన్నికల హామీ మేరకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా దాదాపు 200కు పైగా కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు.

వీరుడా..వీడ్కోలిక..!





సైనిక లాంఛనాలతో గాల్లోకి కాల్పులు జరుపుతున్న ఆర్మీ సిబ్బంది... అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

- అశ్రునయనాల మధ్య జవాను అంత్యక్రియలు
- సైనిక లాంఛనాలతో తుదివీడ్కోలు
- తరలివచ్చిన నార్పల ప్రజానీకం
- కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులు

రెండు రోజుల క్రితం జమ్మూకాశ్మీర్‌లో ల్యాండ్‌మైన్ పేలి మృతి చెందిన జవాను సుబ్బయ్య అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య గురువారం ముగిశాయి. కుటుంబ సభ్యులు, మిత్రులు, బంధువులు ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. చివరిసారిగా జవాన్ సుబ్బయ్య పార్థివదేహాన్ని చూసేందుకు నార్పల నుంచే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున యువత తరలొచ్చారు. జవాను నివాసం నుంచి అంత్యక్రియలు జరిగే తోట వరకు సాగిన అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో యువత జాతీయ జెండాలను పట్టుకుని పాల్గొన్నారు. ఆర్మీ అధికారులు, శింగనమల ఎమ్మెల్యే బండారుశ్రావణిశ్రీ, అధికారులు జవాన్ సుబ్బయ్య పార్థివదేహానికి నివాళులర్పించారు. ఆర్మీ అధికారులు గౌరవ వందనం సమర్పించి.. సైనిక లాంఛనాలతో జాతీయ జెండాను జవాన్ సతీమణి, తల్లికి అందించారు. అనంతరం కుటుంబ సభ్యుల సమక్షంలో అంత్యక్రియల కార్యక్రమాన్ని ముగించారు.

ప్రజాశక్తి-నార్పల

ఈ నెల 9న జమ్ము పూంచ్ సెక్టార్‌లో సైనిక విధుల్లో పహారా కాస్తూ తన తోటి 30 మంది సైనికుల ప్రాణాలను కాపాడి, ల్యాండ్‌మైన్ పేలిన ఘటనలో వీరమరణం పొందిన జవాన్ వరికుంట్ల సుబ్బయ్య అంత్య క్రియలు గురువారం తన భార్య, పిల్లలు నివాసం ఉంటున్న నార్పలలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. జవాను సొంత వ్యవసాయ భూమిలో సైనిక లాంఛనాలతో కుటుంబ సభ్యులు, బంధువులు, యువత మధ్య సైనికాధికారులు అంత్యక్రియలను పూర్తి చేశారు. జవాన్ సుబ్బయ్య అంతిమ యాత్రలో పాల్గొనడానికి మండల వ్యాప్తంగా ప్రజలు పెద్ద సంఖ్యలో నార్పలకు చేరుకుని అశ్రునయనాలతో కన్నీటి వీడ్కోలు పలికారు. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఆర్డీవో కేశవ నాయుడు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప, డీఎస్పీ వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు ఆలం నరసానాయుడు తదితరులు వీరజవాన్ పార్థివ దేహం వద్ద పూలదండలను ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. జవాను సుబ్బయ్య భార్య లీలావతి, తల్లి గాలెమ్మ, పిల్లలు సాయి, లాస్య ప్రియ, సుబ్బయ్య అత్తామామలను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప తదితరులు పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వం తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



రోదిస్తున్న జవాను భార్య లీలావతి

అశ్రునయనాల మధ్య అంతిమయాత్ర

ఇంటి నుంచి మిలిటరీ వాహనంలో జవాను సుబ్బయ్య అంతిమ యాత్ర కొనసాగింది. మృతుని తోటలో వారి ఆచారం ప్రకారం అంతిమ సంస్కారాలు పూర్తయిన తరువాత మిలటరీ హానర్స్ ప్రకారం వీరజవానుకు కుటుంబ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పార్థివ దేహంపై పుష్పగుచ్చాలు ఉంచి అంతిమ నివాళులు అర్పించారు. అనంతరం పార్థివ దేహంపై కప్పి ఉంచిన జాతీయ జెండాను సైనిక అధికారులు జవాన్ తల్లి, భార్యకు ఉద్విగ్న పూర్వక వాతావరణంలో అందించారు. వీర జవాన్ సుబ్బయ్య "అమర్ రహే" అంటూ ప్రజలు నినాదాలు చేస్తుండగా 14 మంది ఆర్మీ సైనికులు మూడు రౌండ్లు చొప్పున మొత్తం 52 రౌండ్లను గాల్లో పేల్చి అంత్యక్రియల కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సాగర్, రాయలసీమ, ప్రకాశం, బళ్లారి జిల్లాల నుంచి మాజీ సైనికులు, జిల్లా మాజీ సైనిక సంఘం తరపున పి.విశ్వేశ్వర రావు, పెద్దిరెడ్డి, ఇండియన్ ఆర్మీ తరపున సికింద్రాబాద్ నుంచి ఈఎంఈ రెజిమెంట్ లెఫ్టినెంట్ కల్నల్ జాకబ్, 9 మద్రాస్, 26 ఆర్ఆర్, ఎఓసీ, ఎన్‌సిసి రెజిమెంట్స్ ఆర్మీ అధికారులు, జవాన్లు, స్థానిక నాయకులు, రెవెన్యూ, పోలీస్ అధికారులు, వందల సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



జవాను పార్థివదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న కుటుంబ సభ్యులు

నోటీసుల జారీలో నిర్లక్ష్యం..!

- మొండిబకాయి పన్ను వసూళ్లపై నీలినీడలు
- లోక్‌అదాలత్ ఉన్నా చెల్లింపుదారులకు అందని నోటీసులు
- రెవెన్యూ సిబ్బందిపై అదనపు కమిషనర్ ఆగ్రహం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తి, నీటి పన్ను వసూళ్ల కోసం పన్ను చెల్లింపుదారులకు ఇచ్చేందుకు సిద్ధం చేసిన నోటీసులు కార్యాలయంలోనే ఉండిపోయాయి. గురువారం రాత్రి 6-30 గంటలైనా ఈ నోటీసులు కార్యాలయం నుంచి బయటకు వెళ్లలేదు. ఈనెల 14వ తేదీన జరిగే లోక్ అదాలత్‌కు సంబంధించి మొండి బకాయిల వసూళ్లకు సంబంధించి బకాయిదారులకు నోటీసులు జారీ చేయాల్సి ఉంది. ఈ నోటీసులు గురువారం నాటికి పంపిణీ జరిగి ఉంటే శనివారం జరిగే లోక్ అదాలత్‌కు పన్ను బకాయిదారులు హాజరయ్యే పరిష్కరించుకునేందుకు అవకాశం ఉండేది. ఆ పని అనుకున్నంత వేగంగా జరగలేదు. పన్ను బకాయిదారులకు ఇప్పటికే నోటీసుల పంపిణీ పూర్తి చేసి ఉంటే వారు డబ్బు సమకూర్చుకుని లోక్‌అదాలత్‌కు హాజరైనప్పుడు చెల్లించే అవకాశం ఉండేది. సంబంధిత అధికారులు గురువారం ఉదయం నుంచి ఎంతో బిజీగా ఉన్నట్లు జిల్లా కోర్టు దగ్గర హడావుడి చేయడం తప్పా నోటీసులను బకాయిదారులకు అందించే చర్యలు మాత్రం తీసుకోలేదు. పన్నులకు సంబంధించి మొండి బకాయిదారుల నుంచి వసూళ్ల చేయాల్సి ఉన్నా సంబంధిత అధికారులు నిద్రమత్తులో జోగుతున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఈ సిబ్బంది తీరుతో కార్పొరేషన్ ఆర్థిక పరిస్థితి మెరుగుపడటం మాట అటుంచి కమిషనర్, అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్లకు మొట్టికాయలు పడే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయనే చర్చ నడుస్తోంది. పన్ను వసూళ్లను వేగవంతం చేస్తారని భావించి బదిలీపై తెచ్చుకున్న రెవెన్యూ విభాగం సిబ్బది తీరును చూసి కార్పొరేషన్ ఉన్నతాధికారులు తలలు పట్టుకునే పరిస్థితి నెలకొంది. ఇలాంటివారిని తాము ఏరికోరి ఆ శాఖలకు ఎందుకు బదిలీలు చేశామంటూ వారినివారే ప్రశ్నించుకుంటున్నారు.



మొండి బకాయిదారులకు ఇవ్వకుండా కార్పొరేషన్‌లోనే ఉంచిన నోటీసులు

కార్పొరేషన్‌లో పన్ను బకాయిదారులకు నోటీసులు ఇంకా ఇవ్వని విషయం అదనపు కమిషనర్ రామలింగేశ్వరకు గురువారం రాత్రి 6-30 గంటల తెలిసింది. దీంతో ఆయన రెవెన్యూ విభాగం ఆర్వోలు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ నిర్వాకంతో లోక్‌అదాలత్‌లో తాము చివాట్లు తినాల్సిన పరిస్థితులు వస్తాయని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఎంతో నమ్మకంతో నియమించుకున్న రెవెన్యూ సిబ్బంది విధుల నిర్వహణలో నిర్లక్ష్యంపై సంబంధిత ఉన్నతాధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ నియామకాల వెనుక లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు తెలుస్తోంది. రెవెన్యూ విభాగం సూపరిండెంట్‌గా నియమితులై రెండు నెలలు కూడా తిరక్కనే దేవశంకర్‌ను అకౌంటెంట్‌గా బదిలీ చేయటం వెనుక అంతరార్థం ఏమిటన్నది ఉన్నతాధికారులకే తెలియాలి. గతంలో కమిషనర్ చల్లా ఓబులేసు ఓ ఉద్యోగి పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ ఆ వ్యక్తికే రెవెన్యూ విభాగంలో పెద్దపీట వేయటం చూస్తే తెరచాటున ఈ బదిలీల్లో పెద్ద వ్యవహారమే జరిగినట్లు తెలుస్తోంది. బదిలీల పర్వంలో అధికారుల చేతివాటం వల్ల అసమర్థత ప్రాతిపదికగా తీసుకుని చేసినట్లుగా ఉందన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సిబ్బంది పని చేయని సిబ్బందిని గాడిలో పెట్టేలా కఠిన నిర్ణయాలు తీసుకోవాలనే భావన కార్పొరేషన్ ఉద్యోగ వర్గాల నుంచి వ్యక్తం అవుతోంది.

'జిందాల్' విస్తరణపై ప్రజాభిప్రాయ సేకరణ

యాజమాన్యం తీరుపై ప్రజల ఆగ్రహం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

జిందాల్ ఫ్యాక్టరీ యాజమాన్యం గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని ప్రజలు కోరారు. మండలంలోని హరేసముద్రం రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్న జిందాల్ సాయి ఫ్యాక్టరీ విస్తరణ నేపథ్యంలో గురువారం ఫ్యాక్టరీ ఆవరణలో పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో ఆర్డీవో వసంతబాబు అధ్యక్షతన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. బొమ్మనహాల్, కురువల్లి, చంద్రగిరి, సిద్ధరాంపురం, హరేసముద్రం గ్రామాల రైతులు, ప్రజలు, పలు ఎన్‌జిఒల సభ్యులు హాజరై యాజమా న్యం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచి తిప్పేస్వామి, ప్రజలు మాట్లాడుతూ జిందాల్ యాజ మాన్యం మూడేళ్లుగా ఒక్క మొక్క కూడా నాటలేదన్నారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడే దుమ్ము, ధూళితో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. ఇకనైనా విరివిగా మొక్కలు పెంచాలని, డ్రెయినేజీల మరమ్మతులు చేయాలని, రోడ్లు ఆధునీకరించాలని, ఫ్యాక్టరీ కాలుష్యం వల్ల పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. మండలంలో విద్య, వైద్యం, తాగునీటి సౌకర్యాలు, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక కాంట్రాక్ట్ ఉద్యోగులపై వేధింపులు ఆపాలన్నారు. గ్రామాలను దత్తత తీసుకొని విద్యార్థులకు బస్సు సౌకర్యం, గ్రంథాలయం, ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం యాజమాన్యం తరపున ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వ నిబంధనల మేరకు యాజమాన్యం అన్నింటినీ అమలు చేయడానికి సిద్ధంగా ఉందని ప్రసాద్ తెలిపారు. కాగా గ్రామాల్లో రైతులకు సమాచారం ఇవ్వకుండా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారని బొల్లనగుడ్డం, కల్లుహోల గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ శాఖ అధికారులు శంకరనాయక్, మునిప్రసాద్, తహశీల్దార్ మునివేలు, ఎస్ఐ నబిరసూల్, పోలీస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు



భార్య సుజాత, కుమారుడు నాగచైతన్యతో సురేష్



బెంగుళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సురేష్ కమార్తె రాహిత్య

క్షణికావేశం..!

- పిల్లలతో సహా తల్లి ఆత్మహత్యాయత్నం
- తల్లీకుమారుడు మృతి
- చావుబతుకుల మధ్య కుమార్తె
- కుటుంబ కలహాలే ఘటనకు కారణం..?

అల్లారుముద్దుగా పెంచిన పిల్లలకు ఆ అమ్మే విషమించి ఊపిరి తీయాలనుకుంది. తనకొచ్చిన సమస్యను పరిష్కరించుకోలేక ఆత్మహత్యే మార్గం అనుకుంది. తనతో పాటు తనపిల్లల్నీ తీసుకెళ్లాలనే అనాలోచిత నిర్ణయం తీసుకుంది. కాసేపు ఓపికతో ఆలోచించే ప్రయత్నం చేయకుండా ఆత్మహత్యే శరణ్యం అనుకుంది. కాసింత కష్టానికే తనవుచాలించేంత పెద్ద నిర్ణయం తీసుకుని కుటుంబాన్ని మొత్తం చీకటిమయం చేసింది. ఓ ఇల్లాలు క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఆ కుటుంబంలో పెనువిషాదాన్ని మిగిల్చింది. గురువారం నాడు గార్లదిన్నె మండల కేంద్రంలో చోటు చేసుకున్న ఈ ఘటనలో తల్లి సుజాత(38), కుమారుడు నాగచైతన్య(12) మరణించగా, చావుబతుకుల మధ్య కుమార్తె రాహిత్య బెంగుళూరులోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. భార్యాభర్తల మధ్య ఏర్పడిన చిన్నపాటి వివాదమే ఈ ఘటనకు కారణమని తెలుస్తోంది. **ప్రజాశక్తి-గార్లదిన్నె**

వార్త మెయిన్‌లో

బద్దేనాయక్ ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న బద్దేనాయక్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

అనారోగ్యంతో బాధపడుతున్న దళిత యువకుడికి గురువారం ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బద్దే నాయక్ రూ. 10వేలు అందజేశారు. శెట్టూరు మండలంలోని ఐదుకల్లు గ్రామానికి చెందిన దళిత పిట్టి రామాంజనేయులుకు మెదడులో రక్తం గూడు కట్టడంతో ఆరోగ్యం విషమించింది. ప్రస్తుతం బెంగళూరులోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రామాంజనేయులు ఆపరేషన్ కోసం ఐదుకల్లు యువకులు విరాళాలు సేకరిస్తున్నారు. ఈ క్రమంలో ఐదుకల్లు యువత బద్దే నాయక్‌ను సంప్రదించగా రూ. 10వేలు అందజేశారు. కార్యక్రమంలో సూర్య టైల్స్ సురేష్, చట్టం రామాంజనేయులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : విప్

ప్రజాశక్తి-రాయదుర్గం

నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి బలమైన పునాది ఏర్పడిందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఈ ఆరు నెలల్లో జరిగిన అభివృద్ధిపై ప్రచురించిన ప్రగతి నివేదికను గురువారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో కాలవ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ జీడి పల్లి-బిటి ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం, తుంగభద్ర ఎగువ కాలువ ఆధునీకీకరణకు సిఎం చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. రూ. 35 కోట్లతో హెచ్ఎల్‌సికి అత్యవసర పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచారన్నారు. కణేకల్లు వద్ద వేదావతిపై రూ. 48 కోట్లతో వంతెన నిర్మాణానికి భూమిపూజ చేశామన్నారు. గోనబావి వద్ద బిసి బాలికల ఆశ్రమ పాఠశాల భవన నిర్మాణం పూర్తికి కసరత్తు ప్రారంభమైందన్నారు. ఉపాధి హామీ ద్వారా గ్రామాల్లో రూ. 16 కోట్లతో సీసీ రోడ్ల పనులు జరుగుతున్నాయన్నారు. ఉంతకల్లు వద్ద రూ. 2 వేల కోట్లతో రిజర్వాయర్ నిర్మాణానికి హామీ ఇచ్చారన్నారు. డి.హీరేహాల్, బొమ్మనహాల్ మండలాల్లో 3,500 ఎకరాల విస్తీర్ణంలో పారిశ్రామికవాడ ఏర్పాటు ద్వారా చిన్న తరహా ఉక్కు పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నామన్నారు. 20వేల ఎకరాల్లో విస్తరించిన ఇసుక మేటల నివారణకు కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నాగరాజు, మండల కన్వీనర్లు హనుమంతు, హనుమంతరెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పురుషోత్తం, జనసేన నియోజక వర్గ ఇన్‌ఛార్జి, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్‌గౌడ్, కౌన్సిలర్ ప్రశాంతి, మాజీ కౌన్సిలర్ హనుమంతు, ధనార్జన పాల్గొన్నారు.



ప్రగతి నివేదికలను విడుదల చేస్తున్న విప్ కాలవ

హమాలీలకు బోనస్ అందజేత

పట్టణంలోని పౌర సరఫరాల శాఖ గోదాములో పని చేస్తున్న హమాలీలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు బోనస్ అందజేశారు. పట్టణంలోని లక్ష్మీనారాయణ హమాలీ యూనియన్ కార్యాలయం వద్ద యూనియన్ గౌరవాధ్యక్షులు బండి కిష్టప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఒక్కో కార్మికునికి రూ. 11 వేల నగదు, మిఠాయి బాక్సు అందజేశారు. ఆరుగురు హమాలీలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు నాగరాజు, సభ్యులు ఆంజనేయులు, దేవేంద్రప్ప, హనుమంతు, రాముడు, వాల్మీకి సంక్షేమ సేవా సమితి ఉపాధ్యక్షుడు మలకన్న, టిడిపి పట్టణ అధ్యక్షుడు నాగరాజు, మండల కన్వీనర్ హనుమంతు, హమాలీ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

జోరుగా సభ్యత్వ నమోదు

నియోజకవర్గ పరిధిలో టిడిపి సభ్యత్వ నమోదులో పురోగతి సాధించినట్లు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. పార్టీ సభ్యత్వాలు 50వేలు దాటిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ 70వేల పైచిలుకు సభ్యత్వాలు లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. రాయదుర్గం టౌన్, డి.హీరేహాల్, కణేకల్లు మండలాలలో 10వేల పైచిలుకు సభ్యులు చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, హనుమంతరెడ్డి, హనుమంతు, పురుషోత్తం, జిలాన్, వేణు, చిన్ని కృష్ణ, ప్రశాంతి, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

మున్సిపాలిటీలో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ఇంజినీర్ నరసింహులుకు వినతి పత్రం ఇచ్చారు. మల్లికార్జున మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ప్రతి నెలా 1వ తేదీనే వేతనం, బకాయి సరెండర్ లీవ్స్ అమలు, జిపిఎఫ్ అకౌంట్, రూ. 21వేలు కనీస వేతనం, జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంపు, పనిముట్లు, ఈపిఎఫ్, ఈఎస్ఐ, రక్షణ పరికరాలు, తదితర సమస్యలు పరిష్కరించాలని, మృతిచెందిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉపాధి కల్పించాలన్నారు. ధర్నాలో కార్మికుల యూనియన్ అధ్యక్షులు తిప్పేరుద్ర, పారిశుధ్య వర్కర్స్ యూని యన్ కార్యదర్శి రాము, కార్మికులు నరసింహులు, గోపాల్, ఓబన్న, జావీద్, కార్మిక సంఘం నాయకులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను ఏకరువు పెట్టారు. గతంలో చేసిన సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలన్నారు. కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ అలిఖాన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాలో మున్సిపల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శివ, వన్నూరుస్వామి, కార్మికులు శివకుమార్, వన్నూరుస్వామి, వెంకటేష్, తిమ్మప్ప, నటరాజ్, రమణ, అలివేలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దాం : మాజీ ఎంపి

ప్రజాశక్తి-కుందుర్పి

వైసిపి అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దామని కళ్యాణదుర్గం పార్టీ సమన్వయకర్త, మాజీ ఎంపి తలారి రంగయ్య పిలుపునిచ్చారు. స్థానిక అలిపిరిస్వామి ఆలయంలో గురువారం ఎస్‌కె.సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి రంగయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతులను విస్మరించిందన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం అనంతపురంలో చేపట్టనున్న ర్యాలీ, ధర్నా కార్యక్రమాల్లో రైతులు, పార్టీ శ్రేణులు, పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కురుబ సామాజివర్గానికి చెందిన మండల కన్వీనర్ ఎంపికపై మాట్లాడారు. 8 మంది పేర్లు నమోదు చేసుకోగా అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి ఒకరిని మండల కన్వీనర్‌గా నియమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి కమలా నాగరాజు, జడ్పిటిసి రాధాస్వామి, వైస్ ఎంపిపిలు శ్రీలక్ష్మిఅజయ్‌బాబు, భీమిరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు ముజావుల్లా, నాయ కులు పాలాక్షి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ లింగప్ప, సర్పంచులు జగన్, మారుతీశ్వరిరామ్మూర్తి, గంగాధర, గౌని ప్రభాకర్‌రెడ్డి, ఓబన్న, హనుమంతరాయుడు, అతావుల్లా, విజయ్‌కుమార్, వెంకటేశులు, తాలూకా కమిటీ ఛైర్మన్లు బాబు, మర్రిస్వామి, తిప్పేస్వామి, శ్రీనివాసులు, ఎంపిటిసిలు ఈరన్న, హనుమంత రాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వసతి గృహం పరిశీలన

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని దొడగట్ట రోడ్డులో ఉన్న బాలికల వసతి గృహాన్ని గురువారం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పరిశీలించి నేలపై కూర్చొని విద్యార్థుల సమస్యలు విన్నారు. విద్యార్థినులు గేట్ సమస్యను తెలుపగా శుక్రవారం మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. మిగతా సమస్యలను కూడా అతి త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు.

గొల్లలదొడ్డి అంగన్వాడీ కేంద్రానికి వసతులు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'సాక్ష్యం' కార్యక్రమానికి మండలంలోని గొల్లలదొడ్డిని ఎంపిక చేశారు. ఇందులో భాగంగా అంగన్వాడీ కేంద్రానికి ఎల్ఈడి టీవీ, ప్రీ స్కూల్ మెటీరియల్, వాటర్ హార్వెస్టింగ్, పోషన్ వాటిక, ప్రీస్కూల్ ఆట వస్తువులు, తదితర సౌకర్యాలు కల్పిస్తారు. పోషణ వాటిక కింద ఆకుకూరలు, కూరగాయలు, పౌష్టికాహారం మెరుగ్గా అందించడం కోసం అంగన్వాడీ కార్యకర్త ఖాతాలోకి రూ. 10వేలు వేస్తారు. మండలంలోని 31 కేంద్రాలకు మరుగుదొడ్డి, 18 కేంద్రాలకు తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపిడిఒ లక్ష్మీశంకర్

ప్రజాశక్తి-కుందుర్పి

మండల నూతన ఎంపిడిఒగా గురువారం లక్ష్మీశంకర్ బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడు తూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్యాలయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

అపర్ణ కుటుంబానికి అండగా ఉంటాం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గంరూరల్

మండలంలోని మంగళకుంట గ్రామానికి చెందిన టిడిపి మహిళా కార్యకర్త అపర్ణ(26) గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలియడంతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాల మేరకు టిడిపి యువ నేత దేవినేని అవినాష్ ఆ గ్రామం వెళ్లి అపర్ణ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10 వేలు అందజేశారు. అపర్ణకు ఒ కుమారుడు, కూతురు ఉన్నారు. ఆమె భర్త ప్రస్తుతం ఎంపిపి పాఠశాల ఛైర్మన్‌గా ఉన్నారు. వారి కుటుంబానికి టిడిపి అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అవినాష్ వెంట సర్పంచి లాల్‌కృష్ణ, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ ముదిగల్లు శ్రీనివాసరెడ్డి, ఊటంకి రామాంజనేయులు, పాలవెంకటాపురం రామ్మోహన్ ఉన్నారు.



అపర్ణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దేవినేని అవినాష్

ప్రజాశక్తి
www.prajasakti.com

పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలి

సిపిఎం ఆధ్వర్యంలో కరెంటు బిల్లులు దహనం చేసి నిరసన



పామిడిలో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్ డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపును వ్యతిరేకిస్తూ గురువారం ఆలూరు రోడ్డులోని విద్యుత్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన ఐదునెలలకే ట్రూఅప్ ఛార్జీల పేర రూ.20వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపడం దుర్మార్గమన్నారు. అదానీతో సెకీ చేసుకున్న విద్యుత్ ఒప్పందాలన్నీ ముడుపులతో కూడినవని తేలినా కూటమి ప్రభుత్వం ఎందుకు రద్దు చేయడం లేదన్నారు. గత ప్రభుత్వం సెకీతో చేసుకున్న ఒప్పందాలను అప్పట్లో టిడిపి వ్యతిరేకించిన విషయాన్ని కూటమి పెద్దలు మరచిపోయారా? అని ప్రశ్నించారు. సౌర విద్యుత్ ఒప్పందాల్లో మాజీ సిఎం జగన్ రూ.1,750 కోట్లు ముడుపులు ముట్టాయని తెలిసినా కూటమి ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందన్నారు. అదానీతో జరిగిన విద్యుత్ ఒప్పందాల కారణంగానే ప్రజలపై అదనంగా రూ.లక్ష కోట్ల భారాలు మోపడానికి సిద్ధపడటం దారుణమన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి అదానీతో చేసుకున్న ఒప్పందాలన్నిటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు జగ్గలి రమేష్, కసాపురం రమేష్, సురేంద్ర, పట్టణ కమిటీ సభ్యులు జ్యోతి, అబ్దుల్లా, ఓబులేసు, జయమ్మ, రామునాయక్, షాషా, వెంకీ, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, టు అప్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో విద్యుత్ ఛార్జీల బిల్లులను తగులబెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు భాస్కర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై విద్యుత్ ఛార్జీలను మోపడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని పెంచిన విద్యుత్ ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, మండల కార్యదర్శి మల్లేష్, కమిటీ సభ్యులు ముత్యాలు, శంకర్, నాగరాజు, బాబాఫక్రుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే 'కౌన్సిల్'ను అడ్డుకుంటాం

సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల ధర్నా



మున్సిపల్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 17వతేదీన నిర్వహించనున్న కౌన్సిల్ సమావేశాన్ని అడ్డుకుంటామని సిఐటియు నాయకులు హెచ్చరించారు. గురువారం నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగేంద్రకుమార్, నగర ప్రధాన కార్యదర్శులు ముర్తుజా, వెంకటనారాయణ, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణ, ఇంజినీరింగ్ సెక్షన్ నగర అధ్యక్ష కార్యదర్శులు ఓబుళపతి, మురళీ మాట్లాడుతూ రెగ్యులర్ కార్మికులకు మూడేళ్లుగా బకాయి ఉన్న సరెండర్ లీవ్ అమౌంట్ ఇవ్వాలని, జిపిఎఫ్ అకౌంట్ ఓపెన్ చేయాలని, జీవో నెంబర్ 36 ప్రకారం రూ.21వేల వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సాంకేతిక లోపాల పేరుతో మూడేళ్లుగా 28 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలు పడలేదన్నారు. వీరికి జనరల్ పండ్స్ నుంచి వేతనాలు ఇచ్చి, తర్వాత జీతాలు పడిన వెంటనే రికవరీ చేసుకుంటామని అధికారులు, పాలకవర్గం చెప్పారుగానీ, ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. క్లాప్ డ్రైవర్లకు బకాయి ఉన్న వేతనాలు చెల్లించి పని భద్రత కల్పించాలని, పెరిగిన నగర విస్తీర్ణం, జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, కార్మికులకు ఇపిఎఫ్, ఇఎస్ఐల్లో ఉన్న తప్పులను సవరించి చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించి, ఎక్స్‌గ్రేసియా, డెత్ బెనిఫిట్స్ ఇప్పించాలని కోరారు. కార్మికులకు పనిముట్లు, రక్షణ పరికరాలను సకాలంలో అందజేయాలన్నారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో కౌన్సిల్ సమావేశాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు 2వ నగర అధ్యక్షులు గురురాజు, ఇంజినీరింగ్ సెక్షన్ రాష్ట్ర కమిటీ సభ్యులు సంజీవరాయుడు, నగర కోశాధికారి పోతలయ్య, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, కోశాధికారి బత్తల ఆదినారాయణ, నగర కార్యదర్శి సాకే తిరుమలేష్, ఉపాధ్యక్షులు శేషేంద్రకుమార్, అనుబంధ సంఘం నాయకులు వెంకటేష్, ముత్తురాజు, నగర కమిటీ సభ్యులు పుల్లన్న, శ్రీనివాసమూర్తి, నాగేంద్ర, మరియమ్మ, రాఘవేంద్రప్రసాద్, అక్కులప్ప,పెన్నోబిలేసు, ఎం.ఆదినారాయణ, హిమంబి, కుమార్, రవి, ఇంజినీరింగ్ సెక్షన్ కమిటీ సభ్యులు లక్ష్మీదేవి, కార్మికులు పాల్గొన్నారు.

పివికెకె ఐటిలో నిపుణుల ఉపన్యాసం



అధికారిని సన్మానిస్తున్న పివికెకె సిబ్బంది

ప్రజాశక్తి-అనంతపురం

పివికెకె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరిశోధన, అభివృద్ధి, మేథో సంపత్తి హక్కుల విభాగాలు సంయుక్తంగా పరిశోధన, ఆవిష్కరణలు, మేథో సంపత్తి హక్కుల ప్రాధాన్యతపై నిపుణులు విశదీకరించారు. ఇందులో భాగంగా ఎస్కెయులోని ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ కె.నాగభూషణ్ రాజు ఇంజినీరింగ్, టెక్నాలజీ విభాగ డీన్‌గా, నైపుణ్యాభివృద్ధి, వ్యాపారాభివృద్ధి, ఇంకుబేషన్ సెంటర్ డైరెక్టర్‌గా ఉన్న ప్రొఫెసర్ రాజు, తమ విశ్లేషణాత్మక ప్రసంగంలో విద్య, పరిశోధనలో అగ్రగామిత్వానికి సంబంధించిన అనేక అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పరిశోధన, అభివృద్ధి డీన్ జి.శ్రీనివాసన్, ప్రొఫెసర్ రాజు, ఐపిఆర్ సెల్ కన్వీనర్ కె.చెన్నకేశవులు, కో-కన్వీనర్ ఎన్.రేఖ, పరిశోధన, అభివృద్ధి కో-కన్వీనర్ వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్ బి.రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ దీప్తి జోర్దాన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో 151 మంది ఎంపిక



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో జెఎన్‌టియు సిబ్బంది

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 151 మంది విద్యార్థులు ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వివిధ మల్టీ నేషనల్ కంపెనీలు మూడునెలల్లో ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. ఇందులో టిసిఎస్, సిటిఎస్, ఫ్యాక్ట్‌సెట్, ఎల్‌అండ్‌టి, మోసచిప్ టెక్నాలజీస్, డెల్టా ఎక్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని విద్యార్థులను ఎంపిక చేసుకున్నారు. టిసిఎస్ కంపెనీలో 121, ఎల్‌అండ్‌టి కంపెనీలో 11, సిటిఎస్ కంపెనీలో 9, ఫ్యాక్ట్‌సెట్ కంపెనీలో ఆరుగురు విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను ఉపకులపతి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, విసి ఒఎస్‌డి ఎన్.దేవన్న, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, ఇండస్ట్రియల్ డైరెక్టర్ ఆర్.కిరణ్మయి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, ప్రాంగణ నియామకాల అధికారి జె.శ్రీనివాసులు, తదితరులు అభినందించారు.

విద్యుత్ ఎఇపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం



తహశీల్దార్‌తో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం అర్బన్ మండల పరిధిలోని రాజీవ్‌కాలనీ పంచాయతీలో ఉన్న మల్లు స్వరాజ్యం కాలనీకి విద్యుత్ లైన్ కట్ చేసిన డి-6 అధికారి ఎఇ ప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ప్రకాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గుడిసెలు వేసుకున్న పేదలకు కరెంట్ కట్ చేయడం బాధాకరమన్నారు. వెంటనే సంబంధిత ఎఇపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకు స్పందించిన తహశీల్దార్ ఆందోళనకారుల వద్దకు చేరుకుని చర్చించారు. అక్కడి నుంచే కరెంటు ఎఇతో మాట్లాడి తక్షణం ట్రేస్ కరెంటు ఇవ్వాలని ఆదేశించారు. దీంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శివర్గ సభ్యులు వలి, మసూద్, వెంకట్ నాయుడు, ఇర్ఫాన్, నగర కమిటీ సభ్యులు వెంకట, వెంకటేష్, నూరుల్లా, షరీఫ్, నాగేంద్ర, అలీ, హాజీవలీ, సూరి, శంషాద్, లాలమ్మ, హరిప్రియ, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతకు కేరాఫ్ జిఐ తలుపులు



శరత్‌చంద్ర ఎంటర్ ప్రైజెస్ దుకాణం, (ఇన్‌సెట్‌లో) యజమాని ప్రసాద్‌బాబు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఇంటి నిర్మాణంలో తలుపులకు ఒక ప్రత్యేక స్థానం ఉంటుంది. తలుపుల్లో నాణ్యత లేకపోతే ఆ ఇంట్లో నివసించే వారికి రక్షణ ఉండదు. ఈ నేపథ్యంలో నగరంలోని బళ్లారి రోడ్డు షిర్డీ సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న శరత్‌చంద్ర ఎంటర్‌ప్రైజెస్ యజమాని ప్రసాద్‌బాబు నాణ్యతతో కూడిన జిఐ తలుపులను అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో పలు విషయాలను పంచుకున్నారు. 'తలుపులకు ఉపయోగించే వాటిలో అత్యంత ధర, నాణ్యత కలిగినవి అని చెప్పుకునే కలప టేక్. ఈ టేకులో కూడా చాలా రకాలు కలిగి ఉంటాయి. చైనా టేకు చెక్కైతే ఇంకా వివిధ రకాలు ఈ టేకులో ఉన్నాయి. ఇందులో ఒరిజినల్ టేక్ ఏదో కనుక్కోవడం కష్టం. ఈ టేకుతో తయారుచేసిన తలుపులను కూడా చెదలు పట్టడం, విరిగిపోవడం, రంగులు వెలిసిపోవడం లాంటివి జరుగుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో నాణ్యతతో కూడిన వాటిని అందించేందుకు జిఐ (గాల్వనైజ్డ్ ఐరన్) తలుపులను అందుబాటులోకి తీసుకుని వచ్చాం. ఇవి ఎంతో నాణ్యతతో ఉంటాయి. ఇవి ఎలా పడితే అలా వంగవు, చెదలు పట్టవు. వీటికి యువి రంగులు వేయడం వల్ల త్వరగా వెలిసిపోయే గుణం ఉండదు. ఎండలో ఉన్నా నీళ్లలో తడిసినా ఏమీ కాదు. స్మార్ట్ లాక్ సిస్టం ఉంటుంది. దాంతోపాటు విజన్ హోల్ ఉంటుంది. తలుపు మూసివున్నప్పుడు ఆ హోల్ ద్వారా బయట ఎవరున్నారో చూసే అవకాశం కూడా ఉంటుంది. అన్నింటికీ మించి ఫ్యాక్టరీ నుంచి నేరుగా కొనుగోలుదారుడికి అవసరమైన కొలతలతో తయారు చేయించి పంపుతాం. ఏ చెక్కకూ లేనటువంటి మన్నిక ఉంటుంది. వీటికి రెండేళ్ల గ్యారెంటీ, పదేళ్ల వారెంటీ కూడా ఇస్తున్నాం. ఇంటి లోపల సీలింగ్ నిర్మాణంలో ప్రధాన ఆకర్షణగా ఈ తలుపులు నిలుస్తాయి. పిఒపికి బదులుగా పివిసితో తయారుచేసే సీలింగ్ సిస్టం వీరి వద్ద ఉంటుంది. ఇంతటి నాణ్యత, రక్షణ కలిగిన వాటిని వినియోగదారులకు తాము అందిస్తున్నాం.' అని శరత్‌చంద్ర ఎంటర్‌ప్రైజెస్ యజమాని ప్రసాద్‌బాబు తెలిపారు.

ప్రజాశక్తి కథనానికి స్పందన
పప్పుశనగ పంట పరిశీలన



రైతుల సాగు చేసిన పప్పుశనగ పంటను పరిశీలిస్తున్న ఎఒ రామకృష్ణ

ప్రజాశక్తి-యల్లనూరు

మండల పరిధిలో రైతు అశ్వర్థరెడ్డి సాగు చేసిన పప్పుశనగ పంటను వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ గురువారం పరిశీలించారు. 'పప్పుశనగకు వైరస్' అనే శీర్షికతో బుధవారం బుధవారం ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ఎఒ పప్పుశనగ పంటను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణం మేఘావృతమై గాలిలో, భూమిలో తేమ శాతం ఎక్కువగా ఉనందున పప్పుశనగకు వేరుకుళ్లు, ఎండు తెగుళ్లు వచ్చే అవకాశం ఉందన్నారు. ఆ తెగుళ్లు సోకితే మొక్కలు వంగి, చనిపోయే ప్రమాదం ఉందన్నారు. తద్వారా పంట దిగుబడి తగ్గిపోతుందన్నారు. నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్, మెటలాక్సిల్, కెప్టెన్, హెక్స ఖనజోల్ వంటి మందులను నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు.

జాతీయ స్కేటింగ్ పోటీల్లో చిన్నారుల ప్రతిభ

అనంతపురం : జాతీయ స్కేటింగ్ పోటీల్లో అనంతపురం చిన్నారులు సత్తా చాటారు. మైసూరులో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో అనంతపురానికి చెందిన స్కేటర్లు హంజా హుస్సేన్, హార్దిక్‌రెడ్డి, సుచిత్‌రెడ్డి అత్యంత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ప్రతిభ కనబరిచిన చిన్నారులను జిల్లా ఆర్గనైజర్ రవిబాల, చీఫ్ కోచ్ పి.నాగేంద్ర, సహాయ కోచులు అనిల్, హేమంత్‌కుమార్, అఖిల్, నరసింహ, ఆనంద్, తదితరులు అభినందనలు తెలిపారు.

జవాను కూతురు విద్యకు చేయూత

ప్రజాశక్తి-నార్పల

వీర జవాను సుబ్బయ్య కుమార్తె లాస్య చదువుకు తమవంతు సాయం అందించేందుకు మండల కేంద్రంలోని ఎల్ఎస్ఆర్‌డబ్ల్యు పాఠశాల యాజమాన్యం ముందుకు వచ్చింది. ప్రస్తుతం లాస్య ఇదే పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. ఇందులో భాగంగా ఆ విద్యార్థిని పదవ తరగతి వరకు తమ పాఠశాలలో ఉచిత విద్యను అందజేస్తామని పాఠశాల గౌరవ సలహాదారు ఎల్.కష్ణయ్య, కరస్పాండెంట్ లక్ష్మీదేవి, డైరెక్టర్ మల్లికార్జున తెలిపారు. గురువారం రాత్రి సుబ్బయ్య భార్య లీలావతి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. లాస్యకు 10వ తరగతి వరకు ఉచిత విద్యను అందిస్తామని వారికి తెలియజేశారు.

ఎంసిఎ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న జెఎన్‌టియు అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల పరిధిలో నిర్వహించిన ఎంసిఎ 2వ సంవత్సరం 1వ సెమిస్టర్ (ఆర్.20) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను గురువారం విడుదల చేశారు. ఫలితాల కోసం విద్యార్థులు కళాశాల అకాడిమిక్ సెక్షన్‌ను సంప్రదించాలని ప్రినిపాల్ పి.చెన్నారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, డిప్యూటీ కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్స్ డి.లలితకుమారి, వివిధ విభాగాలు ఆధిపతులు భువన విజయ, సి.శశిధర్, టి.బాలనరసయ్య, కెఎఫ్.భారతి, ఎం.రామశేఖర్‌రెడ్డి, బి.ఓంప్రకాష్, కళ్యాణ్‌కుమార్, జి.మమత పాల్గొన్నారు.

మృతునికి నివాళి

పామిడి : స్థానిక వికె ఆదినారాయణరెడ్డి కాలనీలో అనారోగ్యంతో మృతిచెందిన చిన్న ఓబులేసుకు పలువురు నాయకులు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో వైసిపి సీనియర్ నాయకులు పెమ్మక చెన్నకేశవరెడ్డి, తదితరులు ఉన్నారు.

పంటల నమోదును వేగవంతం చేయండి

జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న యు.ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-అనంతపురం

రబీ పంటల నమోదును వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి యు.ఉమామహేశ్వరమ్మ డివిజన్, మండల వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో మండల, డివిజన్ వ్యవసాయ శాఖ అధికారలతో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా రబీ 2024-25కి సంబంధించిన పంటల సాగు, ఈపంట నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ పంటల బీమా చేసుకోవడానికి మూడు రోజులు మాత్రమే గడువు ఉందన్నారు. కావున రైతులకు తెలియజేసి బీమా ప్రీమియం చెల్లించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అలాగే రబీ 2024-25కు సంబంధించి కేవలం 26 శాతం మాత్రమే ఈ-పంట నమోదు చేశారన్నారు. కావున వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం వీడి వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇకపోతే రెండు రోజుల్లో తుఫాన్ ఉన్న నేపథ్యంలో రైతుల్లో అవగాహన పెంచి నష్టపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి సహాయ వ్యవసాయ సంచాలకుల ఎం.రవి, వెంకటరాముడు, పద్మజ, లక్ష్మానాయక్, యల్లప్ప, సాంకేతిక వ్యవసాయ అధికారులు రాకేష్‌నాయక్, వెంకటకుమార్, బాలునాయక్, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుడు మృతికి నివాళి

యాడికి : మృతిచెందిన మండల పరిధిలోని చిక్కేపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు జోగి చిన్న నారాయణరెడ్డి మృతికి మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, జెసి నారాయణరెడ్డి గురువారం నివాళులర్పించారు. చిన్న నారాయణరెడ్డి అనారోగ్యంతో కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న నాయకులు గురువారం ఆయన నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి అంజళి ఘటించారు. నివాళులర్పించిన వారిలో ఉపసర్పంచి కాసా చంద్రమోహన్, ఎంపిటిసి సభ్యులు బొంబాయి బ్రదర్ వెంకటనాయుడు, అవుకు నాగరాజు, గొడ్డుమర్రి రామమోహన్, మండల ప్రధాన కార్యదర్శి కోట చౌదరి, వల్లూరు వెంకటనాయుడు, మలపాటి సతీష్‌నాయుడు, రమేశ్వరరెడ్డి, చిట్టెంరెడ్డి బాలరెడ్డి, కృష్ణకుమార్, చిన్నోడు, తదితరులు పాల్గొన్నారు.

'మాకు న్యాయం చేయండి'

ప్రజాశక్తి-పుట్లూరు


తమ గ్రూపు పేరుతో అప్పు తీసుకున్న వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని మండల పరిధిలోని కడవకల్లు గ్రామానికి చెందిన మదర్‌థెరిస్సా సంఘం మహిళా సభ్యులు లక్ష్మీదేవి, వరలక్ష్మి, సూరమ్మ కోరుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రూపులోని ముగ్గురు సభ్యుల పేరుతో రూ.75వేల అప్పు తీసుకున్నట్లు బ్యాంకులో చూపుతోందన్నారు. అయితే తమ గ్రూపు సభ్యులు ఎవరూ డబ్బులు తీసుకోలేదన్నారు. వెంటనే ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని తమ పేరుపై డబ్బు తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు సంబంధిత సొమ్మును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

రేపు సాగునీటి సంఘం ఎన్నికలు

యల్లనూరు : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఆదివారం సాగునీటి సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ రాజా తెలిపారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఎఒ, ఎపిఒ విఆర్ఒ, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 టిసిలకు 4 డబ్ల్యూ గ్రామాల్లో ఎన్నికలు జరగనున్నాయన్నారు. అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరరావు, విఆర్ఒలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పుట్లూరు : సాగునీటి సంఘం ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు తహశీల్దార్ శేషారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 4201 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. వీరందరూ ఆయా ప్రాంతాల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తెలిపారు.

టిక్‌టాక్ శంకర్‌కు అభినందన



శంకర్‌ను అభినందిస్తున్న లీలావతి

ప్రజాశక్తి-శింగనమల

50 కుటుంబాలతో సభ్యత్వ నమోదు చేయించిన మండల కేంద్రంలోని 9 వార్డు టిడిపి కార్యకర్త టిక్‌టాక్ శంకర్‌ను ఆ పార్టీ సీనియర్ నాయకురాలు బండారు లీలావతి అభినందించారు. ఈ సందర్భంగా లీలావతి మాట్లాడుతూ 50 కుటుంబాల సభ్యత్వ నమోదును శంకర్ పూర్తి చేయడం అభినందనీయమన్నారు. పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. కావున ప్రతి నాయకులు, కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు. అలాగే అర్హులందరికీ సంక్షేమ పథకాలను చేరవేయాలని సూచించారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

ప్రజాశక్తి-బెళుగుప్ప

గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహశీల్దార్ సి.షర్మిల తెలిపారు. గురువారం మండల పరిధిలోని సీర్పి పంచాయతీలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో భూములకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ ఈశ్వర్‌రెడ్డి, విలేజ్ సర్వేయర్ శ్రీధర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, గ్రామ పెద్దలు సునీల్, రాధాకృష్ణ, విరుపాపల్లి రాధాకృష్ణ, ప్రతాప్‌చౌదరి, పురుషోత్తం, తిమ్మనాయుడు, అమిలినేని బాబు, రైతులు పాల్గొన్నారు.

పోలీస్ క్వార్టర్స్ స్థలాల పరిశీలన



పోలీస్ క్వార్టర్స్ వివరాలను తెలుసుకుంటున్న ఎఎస్‌పి

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని పోలీస్ క్వార్టర్స్ స్థలాలను గురువారం ఎఆర్ అదనపు ఎస్పీ ఇంతియాజ్ బాషా గురువారం పరిశీలించారు. పోలీసుల నివాసం కోసం 40 ఏళ్ల క్రితం నిర్మించిన క్వార్టర్స్ శిథిలం కావడంతో కొన్ని నెలల క్రితం వాటిని ధ్వంసం చేశారు. దీంతో స్థితిగతులను తెలుసుకోవడానికి ఎఆర్ ఎస్పీ వచ్చి ఫలాలను పరిశీలించారు. అలాగే ఫుట్ బాల్ మైదానం వద్ద సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయ పాత భవనానికి సంబంధించిన స్థలాన్ని కూడా పరిశీలించి ఎస్ఐ కె.సురేష్‌బాబును వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ జాఫర్, కానిస్టేబుళ్లు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాటజూదరులు అరెస్టు

తాడిపత్రి రూరల్ : తాడిపత్రి రూరల్ పరిధిలోని సజ్జలదిన్నె గ్రామ సమీపంలో ఉన్న పొలాలల్లో 10 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. గురువారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ శివగంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు ఆధ్వర్యంలో రూరల్ పరిధిలోని సజ్జలదిన్నె గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డి, ధరణిబాబు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా పేకాట ఆడుతున్న పదిమందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. పేకాట ఆడుతున్న రంగస్వామిరెడ్డి, తప్పల కేశవ, యు.నాగయ్య, బత్తుల శేఖర్, డి.శేఖర్, దూదేకుల దస్తగిరి, పల్లె గోపాల్‌రెడ్డి, మార్క్యాపురంరెడ్డి, ఇస్మాయిల్ చిన్న ఓబులేసు, చిన్న కథలప్పను అరెస్టు చేసి రూ.29వేలతోపాటు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో సిఐతో పాటు ఎస్ఐ ధరణిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణి ఆత్మహత్యాయత్నం

గుత్తి : మండలంలోని కె.ఊబిచెర్ల గ్రామానికి చెందిన గర్భిణీ ఉమాదేవి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రైతు రామాంజనేయులు భార్య ఉమాదేవి కొన్నేళ్లుగా కుటుంబ సమస్యలతో బాధపడుడూ ఉండేది. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపం చెందిన ఉమాదేవి బుధవారం రాత్రి ఇంట్లో ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన భర్త, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. కాగా ఒంటికి నిప్పు అంటించుకోవడంతో కడుపులో ఉన్న బిడ్డ కూడా తీవ్రంగా గాయపడినట్టు వైద్యులు తెలిపారు. బాధితురాలు ఉమాదేవి వాంగ్మూలాన్ని తహశీల్దార్ ఓబిలేసు నమోదు చేశారు. భర్త రామాంజనేయులు మామ రంగస్వామి వేధింపుల వల్లే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసే దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ కె.సురేష్‌బాబు తెలిపారు.

దాడి కేసులో నిందితులు అరెస్టు

తాడిపత్రి : తాడిపత్రిలో గత శనివారం దాడికి పాల్పడిన వారిలో ఐదుగురిని పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన నలుగురి కోసం గాలిస్తున్నట్లు సిఐ ప్రసాద్ తెలిపారు. సిఐ తెలిపిన వివరాల మేరకు.. తాడిపత్రిలోని కృష్ణాపురురం జీరో రోడ్డు గంగమ్మ గుడి ఎదురుగా బెల్దారి మేస్త్రి మదన శంకరనారాయణ, మల్లెల నాగేంద్ర, రొక్కం సుబ్బారాయుడులపై కొందరు దాడి చేశారు. దీంతో స్పందించిన పోలీసులు గురువారం పట్టణంలోని బుగ్గ రామలింగేస్వర స్వామి ఆలయ వద్ద నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కే ఆదేశించినట్లు తెలిపారు. నిందితుల్లో మైనర్లు ఉండటంతో జువైనాల్ జేస్టిస్ బోర్డు ముందు హాజరు పరిచారు. ఇంకా ఈ కేసులో నలుగురు పరారీలో ఉన్నట్లు తెలిపారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఫారెస్టు అధికారులు

అటవీశాఖ అధికారులకు అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం

ఆత్మకూరు మండలంలోని పంపనూరు వద్ద ఉన్న నగరవనం పార్కులో గురువారం అనంతపురం అటవీశాఖ ఆధ్వర్యంలో నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ వారు అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంఎస్ ట్రిల్ ఫైస్ పెట్రోలింగ్ యాప్ వాడకం, కెమెరా ట్రాప్ ఆపరేషన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా అటవీశాఖ అధికారి విగ్నేష్‌కుమార్ అప్పావు, జిల్లా అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జవాన్ మృతికి ఎంపి సంతాపం

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

విధి నిర్వహణలో వీరమరణం పొందిన సైనికుడు వరికుంట్ల సుబ్బయ్యకు ఎంపి అంబికా లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలిపారు. సుబ్బయ్య పూంచ్ సెక్టార్ నియంత్రణ రేఖ వద్ద విధులు నిర్వహిస్తుండగా ల్యాండ్‌మైన్ పేలి ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. తాను మరణిస్తూ తోటి 30 మంది సైనికులను ప్రమాదానికి దూరంగా ఉంచేందుకు కేకలు వేసి అప్రమత్తం చేయడం అత్యంత వీరోచితమెందన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీర జవాన్ కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటాయని తెలిపారు.

అయ్యప్పస్వామి గ్రామోత్సవం

ప్రజాశక్తి-యాడికి

మండల కేంద్రంలోని బుగ్గరోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి గ్రామోత్సవం గురువారం మాలధారులు, భక్తులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత గ్రామోత్సవం చేశారు. భక్తులకు ఎంపిపి దంపతులు బొంబాయి ఉమాదేవి, మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి కాసా చంద్రమోహన్, ఎంపిటిసి సభ్యులు బొంబాయి బ్రదర్ వెంకటనాయుడు, అవుకు నాగరాజు, గొడ్డుమర్రి రామమోహన్, వార్డు సభ్యులు గుంత తిరుపతి, మలపాటి సతీష్‌నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి కోటా చౌదరి, పఠాన్ దూద్‌వలి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరం

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని తొండపాడు గ్రామంలో గురువారం ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ వైద్యుడు సుధాకర్, జక్కలచెరువు పశు వైద్యుడు ప్రదీప్ కృష్ణలు కలిసి పశువులను పరీక్షించారు. 90 శాతం కచ్చితత్వంతో పేయి దూడలు పుట్టుకను ఉద్దేశించి లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పశు వైద్యులు మాట్లాడుతూ పేయి దూడలు పొందే లింగ నిర్ధారిత వీర్యం సేకరణకు సూదులను ప్రభుత్వం ఉచితంగా లింగ నిర్ధారిత వీర్యం సేకరణకు సూదులను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. భవిష్యత్తులో లింగ నిర్ధారిత వీర్యం అత్యధిక ప్రాచుర్యం పొందుతుందన్నారు. అనంతరం గ్రామంలో పశువుల్లో చూడి నిర్ధారణ, తిరిగి ఎదకు వస్తూ కట్టకుండా నిలిచిపోయినవి, పూర్తిగా ఎదకు రాని 34 పశువులకు గర్భకోశపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎహెచ్‌ఐలు సాల్మన్ రాజు, అల్లూరి సీతారామరాజు పాల్గొన్నారు.



పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సుస్థిర మండలాభివృద్ధిపై ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి-నార్పల

మండల సుస్థిర మండల అభివృద్ధి లక్ష్యాలపై మండలంలోని అన్ని మండల శాఖల అధికారులు, విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ గంగావతి అధ్యక్షతన నిర్వహించిన రెండు రోజుల శిక్షణ గురువారం ముగిసింది. ఇందులో భాగంగా మండలంలో ప్రజలకు అవసరమైన మౌలిక అవసరాలు, భవిష్యత్తులో అవసరమయ్యే అవసరాలు, గ్రామీణ ప్రాంత ప్రజల ఉపాధి అవకాశాలు తదితర వాటిపై అధికారులు, పాలకులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి శిక్షకులుగా ఇఒఆర్‌డి శైలజారాణి, ఆర్డబ్ల్యూఎస్ ఇంజినీర్ జనార్ధన్, సిహెచ్‌ఒ బాలాజీరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సృణాలిని, వెలుగు ఎపిఎం తిప్పమ్మ వ్యవహరించారు.

పామిడి : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ తేజోష్ణ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని మండల శాఖల అధికారులు, విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా డిపిఒ నాగరాజునాయుడు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, ఉపాధి కల్పన తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి కృష్ణకుమార్ పాల్గొన్నారు.

శింగనమల : సుస్థిర మండల అభివృద్ధిపై రెండురోజుల పాటు మండల కేంద్రంలో నిర్వహించిన శిక్షణ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా డివిజన్ పంచాయతీ అధికారిణి సుమన జయంతి ఆర్‌జిఎస్‌ఎ కార్యాచరణ ప్రణాళికపై శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నిర్మలాకుమారి, డిఎల్‌డిఒ లలితాబాయి, మండల విస్తరణ అధికారి వెంకట లక్ష్మమ్మ, ఎఒ నాగభూషణ్‌రెడ్డి, సిహెచ్‌ఒ గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ అలివేలమ్మ ఆధ్వర్యంలో సుస్థిర మండల అభివృద్ధిపై నిర్వహించిన రెండు రోజుల శిక్షణ గురువారం ముగిసింది. ఇందులో భాగంగా మండలంలో ప్రజలకు అవసరమైన మౌలిక అవసరాలు, భవిష్యత్తులో అవసరమయ్యే అవసరాలు, ప్రజల ఉపాధి అవకాశాలు తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి జిలాన్‌బాషా, ఎంపిఎం వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన శిక్షణ గురువారం ముగిసింది. ఇందులో భాగంగా మండలంలోని ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, ఉపాధి కల్పన, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి మనోహర్‌బాబు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న నార్పల ఎంపిడిఒ గంగావతి

'నెట్టికంటికి' ఇరుముడి సమర్పణ

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామికి మాలధారులు గురువారం భక్తిశ్రద్ధలతో ఇరుముడి సమర్పించారు. 41 రోజులు నిష్టతో స్వామివారి మాలను ధరించి దీక్షతో స్వామివారిని సేవిస్తారు. అనంతరం స్వామివారికి అత్యంత ప్రీతికరమైన సింధూరం, గంధం, పన్నీరు, నెయ్యి వంటి ఇత్యాది పూజ సుగంధ ద్రవ్యాలు సమర్పిస్తారు. ముందుగా మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామ సమీపంలో ఉన్న ఆంజనేయ స్వామి వద్ద ఇరుముడులు ధరించి కాలినడకన పట్టణంలోని అభయాంజనేయ స్వామివారి వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి వెండి రథంపై సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి సహిత ఉత్సవ విగ్రహాలను కొలువదీర్చి అర్చన, అభిషేకాలు చేశారు. ఉత్సవమూర్తులు ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి మాలదారులు, భక్తులకు దర్శనం గావించారు. అక్కడి నుంచి పట్టణ వీధుల గుండా కసాపురానికి శోభాయాత్రగా బయలుదేరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ వాణి, ఎఇఒ మల్లికార్జున, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, ఆలయ ప్రధాన అర్చకులు గరుడ స్వామి, అర్చకులు చక్రవర్తి, అనంత పద్మనాభ శర్మ, అనంత ఆచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



శోభాయాత్రలో పాల్గొన్న మాలధారులు

టిడిపి సభ్యత్వ నమోదుకు విరాళం

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

టిడిపి సభ్యత్వ నమోదుకు రుద్రంపేట టిడిపి నాయకులు భక్తవత్సలం, 31వ డివిజన్‌కు చెందిన లక్ష్మీనారాయణ చెరో రూ.50వేలను గురువారం విరాళంగా అందజేశారు. ఈమేరకు గురువారం అర్బన్ టిడిపి కార్యాలయంలో టిడిపి రాష్ట్ర నాయకుడు గంగారామ్‌కు సంబంధిత మొత్తాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయా నాయకులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభినందించారు.



విరాళం అందజేస్తున్న భక్తవత్సలం

ముమ్మరంగా వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలతో గురువారం నగరంలో పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా వన్‌టౌన్ సిఐ రాజేంద్రనాథ్‌యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక థామస్ మన్రో కూడలి, టూటౌన్ సిఐ శ్రీకాంత్, ఎస్ఐ రుష్యేంద్రబాబు ఆధ్వర్యంలో క్లాక్‌టవర్, అంబేద్కర్ సర్కిల్, త్రీటౌన్ సిఐ శాంతిలాల్ ఆధ్వర్యంలో గుత్తిరోడ్డు, 4వ పట్టణ సిఐ కనుమూరి సాయినాథ్ ఆధ్వర్యంలో రుద్రంపేట సర్కిల్, కళ్యాణదుర్గం రోడ్లలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతి వాహనాన్ని చెక్ చేసి రోడ్డు భద్రత ఉల్లంఘనలపై చర్యలు తీసుకున్నారు.

ఉపాధిపై సామాజిక తనిఖీలు

బుక్కరాయసముద్రం : మండల వ్యాప్తంగా జరిగిన అభివృద్ధి పనులపై రేపటి నుంచి సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఎస్‌ఆర్‌పి లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా 2023-24లో మండల వ్యాప్తంగా చేపట్టిన పనుల సామాజిక తనిఖీపై కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒలు పోలేరయ్య, సుజాత, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు, సాంకేతి సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

మోటార్లకు మీటర్ల ఏర్పాటు వైసిపి పాపమే..

ప్రజాశక్తి-అనంతపురం

రైతుల వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించి ఉరివేయాలని చూసిన పాపం వైసిపిదే అని ఎపి పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు, వాల్మీకి, బోయ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పిఎల్ఎన్ మూర్తి, మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహమ్మద్ ఆరోపించారు. గురువారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు రైతులకు అండగా నిలిచేది ఒక్క టిడిపినే అన్నారు. చంద్రబాబు రైతుల పక్షపాతి అన్నారు. రాష్ట్రంలో వైసిపి గల్లంతు అవుతున్న విషయాన్ని గ్రహించిన ఆ పార్టీ నాయకులు పార్టీని బతికించుకునేందుకు రైతుల మాటున రాజకీయం చేస్తోందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులను నిండా ముంచిన వైసిపి నాయకులు ఇప్పుడు మొసలి కన్నీరు కార్చడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులకు వ్యవసాయ మోటార్లను పక్క రాష్ట్రం తిరస్కరిస్తే జగన్ మాత్రం రాష్ట్రంలో మోటార్లకు మీటర్లు బిగించాలని నిర్ణయం తీసుకుని ఉరితాళ్లు వేశారని ధ్వజమెత్తారు. ఆర్‌బికెల పేరుతో రైతులకు పంగనామాలు పెట్టి.. ఇప్పుడు రాజకీయం చేయడం తగునా అని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు రైతుల పేరుతో రాజకీయం చేయడం మానుకోవాలని సూచించారు. అదేవిధంగా తప్పకుండా కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుకు రూ.20వేలను రైతుల ఖాతాలకు జమ చేస్తుందన్నారు. ఈ సమావేశంలో రజక చైతన్య సంఘం జిల్లా అధ్యక్షులు పుల్లలరేవు మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

పశువుల షెడ్ల నిర్మాణాలు పరిశీలన

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని ఆకులేడు, వెస్ట్ నరసాపురం గ్రామాల్లో చేపట్టిన పశువు ల షెడ్డు నిర్మాణాలను జిల్లా డిడబ్ల్యూఎం ఎపిడి సలీంబాషా గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువుల షెడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత తగ్గకుండా, త్వరితగతిన పూర్తి చేయించాలని సూచించారు. అలాగే కొండల్లో మొక్కల పెంపకంపై పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నిర్మలాకుమారి, ఎపిఒ శ్రీదేవి, టెక్నికల్ అసిస్టెంట్లు నారాయణస్వామి, ఓబులేసు, అలివేలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : మండల పరిధిలోని 85 నిట్టూరు గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన మినీ గోకులం పనులను ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి గురువారం పరిశీలించారు. ఇందులో భాగంగా పనుల నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ షబ్బీర్, టెక్నికల్ అసిస్టెంట్ శంకర్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



గోకులం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

దివ్యాంగుల దినోత్సవం

ప్రజాశక్తి-గుత్తి

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని గౌతమిపురి వికలాంగుల మండల సమైక్య ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని ఎస్ఐ సురేష్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా, ఇఒఆర్‌డి శివాజీరెడ్డి, టిడిపి నాయకుడు గుమ్మనూరు నారాయణ, పట్టణ అధ్యక్షుడు ఎంకె.చౌదరి, దివ్యాంగుల సంఘం నాయకులు శ్రీనివాసులు, రవి, అది, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.